# శారదలేఖలు

సౌభాగ్యవతియగు కల్పలతకు—

నెచ్చెలీ!

చూచితిని, సమదర్శినీగర్భశుక్తిముక్తాఫలమగు యుగాదిసంచికను చూచితిని. చక్కని కాగితములతో మచ్చనైన అచ్చుతో రమ్యములైన చిత్తరువులతో మనోహరములైన భావగీతావళులతో దివ్యములైన వ్యాసములతో సంచిక రమణీయమై యొప్పారుచున్నది. ఆతెలుగు నిరాఘాటముగా చెన్నరాజధానీప్రజాయత్తశాఖల బాలించిన ప్రతిభాశాలియగు నాసచివశేఖరుని రాజలాంఛనాలంకృతంబగు త్రివర్ణముఖచిత్రము నిజముగా నాసంచిక కపూర్వశోభనే గూర్చుచున్నది. రాజకీయసాంఘికార్థికసారస్వతానేక విషయములనుగూర్చి వ్రాయబడిన ప్రసిద్ధవ్యాసములు పునః పునః పఠనీయములై తనరారుచున్నవి. అందందు తనరారుచున్న పద్యమాల లాసంచికాబాలకు మణిహారములే సందియములేదు. కాని యెట్టిచక్కదనాలచుక్కకైన యించుకంతలోపముండకపోదు. విధాతృసృష్టిలోనే యిట్టిలోటు సర్వసాధారణముగా కనుపించుచుండును. ఇక మానవసృష్టిలోనుండుటలో వింతయేమున్నది? పాశ్చాత్య స్త్రీలనుగూర్చి వ్రాయఁబడిన వ్యాసమా సంచికలోఁ జేరుట నిజముగా నాసంచిక కొకకళంకమనియే చెప్పవచ్చును. అయినను నీ విషయమై యాసంచికా నిర్వాహకులనుగాని యావ్యాసకర్తనుగానియనవలసిన పనిలేదు. వారి పత్రికానామమే వారి మతమును నిరూపించుచున్నది. కాన సమదర్శన భావముతో నావ్యాసము నందుకొనిరి. ఇక వ్యాసకర్త విషయమా? ఆ సోదరునకు పాశ్చాత్యస్త్రీలనుగూర్చి తెలిసినంత మాతృదేశస్త్రీలనుగూర్చి తెలియదు. పాపము తెలిసియుండినచో అంత అసభ్యముగను నంతపేలవముగను వ్రాసియుండరు. దానికేమి? ప్రమాదోధీమతామపి. ధీమంతులకుగూడ నొక్కొక్కప్పుడు పొరబాటు కలుగుచుండును. కాని ఆకథలేమి? మాణిక్యము వంటి సంచికలో మసి చుక్కలుపెట్టినట్లున్నవే? కల్పలతా! ఆకథలను జదువగనే నాకు మితిలేని విచార మొదవినది. ఏమి ప్రయోజనము గోరి యాపట్టభద్రు లిట్టిచెట్ట కథలను వ్రాసిరో కానిప్పటికిని యూహింపలేకున్నాను.

మానవులు సహజముగా కథాప్రియులు. పాలుత్రాగు పసిబిడ్డగూడ చీమకథనో చేపకథనో చెప్పమొదలిడితి మేని యేడ్పుమాని ఊ కొట్టును. ఈ పసితనమునాటి కథాప్రియత్వము మనుజులకు వార్ధక్యము వచ్చినను సడలదు. పత్రికాపాఠకులైన వారిలోగూడ సారస్వతవిషయములనిన విసుగుకొనెడి వారును, చారిత్రకవృత్తాంతమనిన తల కంటగించుకొనెడి వారును, ప్రపంచవార్తలనిన వలదనెడి వారును, మతవిషయములనిన మూకెంపు కనెడువారును, భావగీతావళులనిన నేవపడెడు వారును, కలరుగాని కథలనిన చెవి గోసికొనని వారుండరు. ప్రతినెలయు మా యిరుగు పొరుగు అమ్మలక్కలు "ఏమండీ గృహలక్ష్మి వచ్చిందా? భారతి వచ్చిందా? ఏంకథలున్నాయి. ఒక మారుచూపరూ." అని కథలకొఱకే భారతీ గృహలక్ష్ముల క్షేమసమాచారము లడుగు చుందురు. ఆపత్రికలలోని యొకటి రెండు కథలు చదివినచో వారి చదువు పూర్తియైనట్లే, ఇక వానిలో వివిధ విషయములను గూర్చి కూర్చిన విజ్ఞానమంతయు వారి దృష్టిలో వట్టిచెత్త. చదువగనే యర్థమయ్యెడివిని చదివినంతనే యానందమును గూర్చెడివిని కథలు, కాన యన్నివిషయములకంటె కథలనిన ప్రజలకెక్కువ మక్కువ. ఈ విధముగా పండితపామరవివక్షతయు, బాలవృద్ధభేదమును లేక యెల్లరియామోదమును బడిసెడి కథలెంత ప్రశస్తములై యుండవలెను? అది యేమిపాపమోగాని ఆధునికకథా వాఙ్మయమట్టి ప్రశస్తతను గోల్పోయి యుండుటకు కడుంగడు విచారము గొల్పుచున్నది. ఒక మారు మాఅన్నగారితో మాట్లాడుచుండగా మాటల సందర్భమున "కథలు యెట్లా ఉండాలె?" అని నేనుమాసోదరునడిగితిని. తన వాళ్లను నలుగురిని దగ్గరకూచో పెట్టుకొని చదివేటట్లుండాలె అని ఆయన అనెను. అంటే? అన్నాను నేను. మగవాడు తన తల్లికి, కొమార్తెకు, తోబుట్టువుకు, భార్యకును; ఆడుది, తన తండ్రికి, సోదరునకు, పెనిమిటికి, పుత్రునకును, చదివి వినిపించుటకు అర్హమైనదిగా ఉండాలె. కథలేగాదు చిత్తరువులుగూడ అట్లే ఉండాలె. అని ఆయన యనెను నాకు హితోపదేశము చేయుటకై మాసోదరు డావాక్యము లనకపోయినను, ఆమాటలు గురుమంత్రమువలె నా మనస్సున శాశ్వతముగా నాటిపోయినది. ఏదేని యొక కథవ్రాయ దొరకొనినచో భావగర్భితమైన యావాక్యము నాకు మాటిమాటికి స్ఫురణకు వచ్చుచు అంధకారపథమున దీపకళికవోలె తోచి నాకర్తవ్యతాపథమును నిరూపింపుచుండును. ఇతరకథలను చదివినప్పుడు గూడ ఆకథలు పైవాక్యమునకు సరిపడి యున్నవాయని యోచించుట నాకుపరిపాటి. సమదర్శినీ సంచికలోని కథలను జదివిగూడ నే నిట్లేయోచించితిని. రెడ్డిరంగమ్మ యెడ్డెతనపుగాథను జదివి అసభ్యము, అసాధారణము

అని మనస్సున చీకాకుపడి సావిత్రి, యనుచల్లనిపేరుగాంచి యీకథనైన మనశ్శాంతి నీయకపోదని కుతూహలముతో జదివితిని. మొదటికథకంటె యథార్థముగ నున్నదీ కథ. "మాప్రణయగాథ" సరేసరి. అన్నిటికంటె గొడవగానున్నది. అమ్మడు గొడవ. సమదర్శినీపత్రికాధిపతులు తమ సముదర్శకత్వమును తేటపఱచుటకై హితాహితములను గమనింపక యిట్టి కథలకు తావొసంగి రనుకొందము. కాని వ్రాసిన వారివి యెందులకు వ్రాసిరి? ఆ కథలు తల్లి బిడ్డకు చదివి వినిపింప దగినవికావు. బిడ్డ తండ్రికి చదివి వినిపింప దగినవి కావు. సోదరుఁడు తోబుట్టువునాకథలను చదువుమని చెప్ప సాహసింపచాలడు. స్నేహితుఁడు ఒక స్నేహితుని ముందరాకథలను సిగ్గువిడిచి చదువజాలడు. తుదకు అగ్నిసాక్షిగా పెండ్లాడిన ఆలుమగలు కాదుగదా కూరిమికిగూడిన స్త్రీ పురుషులైన ఆకథలను జదివి మోదింపజాలరు. సావిత్రివంటి, రెడ్డిరంగమ్మ వంటి, పనికిమాలిన స్త్రీ లెచ్చటనైన నున్నచో వారిని గూర్చి బహిరంగముగా జెప్పుకొనుటకే యోగ్యులైన వారు పూర్వము జడియువారు. మనసున తలపరాని వాక్కున నుచ్చరింపరాని యట్టి వృత్తాంతములిప్పుడు విద్యాధికుల లేఖనీసన్మానమునందుచు రమణీయకథలై పత్రికలలో పాత్రములలో నెక్కుచున్నవి. ఆహా! కాలమహిమ!

కథ అచ్చుపడి దేశములో ప్రవేశించిన తరువాత అవివాహితయైన బాలిక చదువును. అన్నెపున్నెము లెఱుగని బాలవితంతువు చదువును. పత్యనురక్తయగు నిల్లాలు చదువును. వైరాగ్యోదయమైన వృద్ధురాలు చదువును. అట్లే పురుషులలో గూడ విద్యార్థులు మున్నగు పలురకముల వారు చదువుదురు. అందఱు చదువుట కర్హమైనదిగా నుండవలయుట కథారచయితల ముఖ్యధర్మమై యున్నది. కథకులే గాక కథకురాండ్రు గూడ యిట్టి కథలను వ్రాయ సాహసించుచున్నారు. దైవము వీరికి మంచి త్రోవను చూపుగాక.

కల్పలతా! యోచింప, యోచింప, భావకవులనబడెడివారేదియో యొక ఆడ పేరు బట్టుకొని 'ప్రేయసీ! ప్రేమసీ' యని యల్లాడుటయు, కథకులైన వారు 'ప్రేమ ప్రేమ' యనుచు స్త్రీలను గూర్చి యిట్టి విపరీతపు అసమంజసపు గాథలల్లుటయు, జూడ ఆంధ్రభాష దురదృష్టమో ఆంధ్రస్త్రీల దురదృష్టమో యోచింపలేకున్నాను.

శారద.